క్లుప్తంగా

అర్హులైన నిరుపేదలకివ్వాలి

మంథని: కాకర్లపల్లి గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. మంథని రెవెన్యూ శివారులోని రెడ్డి చెరువును ఆనుకొని ఉన్న 16 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిని అర్హులైన నిరుపేద దళితులకివ్వాలని కోరారు. గతంలో కాకర్లపల్లి దళితులకు భూములిచ్చి సీలింగ్ రికార్డులో నమోదు చేశారన్నారు. ఇప్పటివరకు పట్టాలివ్వలేదని, అనేక సంవత్సరాలుగా పట్టాలు పంపిణీ చేయాలని తిరుగుతున్నా అధికారులు కనికరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేశ్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కల్లేపల్లి అశోక్, శ్రావణ్ ఉన్నారు.

బీసీ-డీ నుంచి బీసీ-ఏకు మార్చాలి

సుల్తానాబాద్: ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏకు మార్చాలని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం పట్టణంలోని పూసాల ముదిరాజ్ సంఘం భవనం, పెద్దమ్మ దేవాలయం సందర్శించారు. పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు గుర్రాల మల్లేశం మాట్లాడుతూ.. పూసాల గ్రామంలో 500 ముదిరాజ్ కుటుంబాలున్నాయని, ముదిరాజ్ సంఘం కల్యాణ మండప పనులకు కార్పొరేషన్ నుంచి నిధులిప్పించాలని కోరారు. న్యాయవాది డీఎల్ పాండు, యూనివర్సిటీ నాయకులు జగన్ ముదిరాజ్, బొక్క శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ చొప్పరి శ్రీనివాస్, 14వ వార్డు మాజీ కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈకి వీడ్కోలు

రామగుండం: పట్టణంలోని 62.5 మెగావాట్ల సామర్థ్యం గల బీ-థర్మల్ విద్యుత్ కేంద్రానికి సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా సుదీర్ఘకాలం పని చేసి యాదాద్రి(వైటీపీపీ)కి బదిలీపై వెళ్తున్న పి.విజేందర్‌ను సోమవారం తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్-1535 రాష్ట్ర ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. పదకొండు మాసాల క్రితం మూతపడిన బీ-థర్మల్ విద్యుత్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను ఇటీవల యాదాద్రి కేంద్రానికి బదిలీ చేసింది. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం కుమారస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ తఖీ, రామగుండం బ్రాంచి చైర్మన్ అబ్దుల్ నక్మీ తదితరులున్నారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ఎలిగేడు: భూసమస్యల పరిష్కారం కోసం భూభారతిలో జిల్లాలో ఎలిగేడు మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిస్తున్నారు. ధూళికట్ట, నారాయణపల్లి, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో అధికారులు సోమవారం రెండో రోజు రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. మే 5 నుంచి ఇప్పటి వరకు ఆయా గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభల్లో 759 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆర్ఐలు జయలక్ష్మి, చంద్రశేఖర్, రెవెన్యూ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాలు

ఎలిగేడు: మండలానికి సబ్సిడీపై పచ్చిరొట్టె(జీలుగా) విత్తనాలు వచ్చినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.ఉమాపతి తెలిపారు. ఎలిగేడు, ధూళికట్ట ప్రాథమిక సహకార సంఘాల్లో 800 బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

గుడుంబా, బెల్లం పానకం ధ్వంసం

ఓదెల: కొలనూర్‌లో పొత్కపల్లి ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో సోమవారం బెల్లం పానకం ధ్వంసం చేశారు. కొలనూర్‌లో గండికోట కనకయ్య పెట్టిన గుడుంబా స్థావరంపై దాడి చేసి 500 లీటర్ల పానకం ధ్వంసం చేయడంతోపాటు 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గోదావరిఖని: స్థానిక ఫైవింక్లయిన్ సమీపంలో ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. ఎం.శ్రీనివాస్ అనే వ్యక్తి ప్రేమ వ్యవహారంలో అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడిన ఇతన్ని గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి, పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆటో ట్రాలీ చోరీ

సుల్తానాబాద్‌రూరల్: గాంధీనగర్‌కు చెందిన రవి ఆటో ట్రాలీని గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. ఆదివారం రాత్రి తన ఇంటి ముందు ఉంచగా.. సోమవారం ఉదయం చూసేసరికి ఆటో కనబడకపోవడంతో స్థానిక పోలీసులకు సమాచారమందించారు.

క్షుద్ర పూజల కలకలం

సుల్తానాబాద్‌రూరల్: గట్టెపల్లి గ్రామంలో ముఖ్య కూడలిలో(మూడు రోడ్లు) వద్ద క్షుద్ర పూజలు చేశారంటూ ప్రచారం జోరందుకుంది. ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పూజలు చేసి రోడ్డుపై కొబ్బరికాయలు, ఎర్రటి వస్త్రంలో పూజకు సంబంధించిన సామగ్రిని రోడ్డుపై వేశారా, లేక క్షుద్ర పూజలు చేశారా అని గ్రామస్తులు భయాందోళనలకు గురువుతున్నారు.

వానర సైన్యాన్ని ఆపతరమా..?


రైల్వే యూనియన్ కార్యాలయంపై కోతులు


రాత్రి విద్యుత్ తీగలపై వేలాడుతున్న వానరాలు

రామగుండం: పట్టణం.. పల్లె.. వనం.. భవనాలు.. రాత్రి.. పగలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో కోతులు విపరీతంగా పెరుగుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాది కాలంలో వానర సంతతి మూడింతలు పెరుగుతుండడం గమనార్హం. ఫలితంగా అన్ని వర్గాల ప్రజలు కోతులతో ఎన్నో కష్టాలనెదుర్కొంటున్నారు. రాత్రి కూడా కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సర్వీసు తీగలు పట్టుకొని వేలాడుతుండడంతో తెగి కింద పడిపోతున్నాయి. ఫలితంగా ఇంట్లో విద్యుత్ సరఫరా అంతరాయంతోపాటు విద్యుత్ స్తంభం నుంచి తెగిపోయి కింద పడిన సర్వీసు వైరుకు విద్యుత్ సరఫరా ఉండడంతో భారీ ప్రమాదం తప్పినట్లయింది. చెత్త కుండీల్లో పడేసే వ్యర్థాలను చిందరవందర చేయడం, ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి పడేసే వ్యర్థాలను పట్టుకొని పరుగు పెట్టడంతో.. దానివెంట వందల సంఖ్యలో కోతులు పరుగుపెట్టడంతో వ్యర్థాలు రోడ్డుపై, ఇళ్లపై పడడంతో దుర్వాసన, అసౌకర్యంగా మారుతోందని ఆవేదన చెందుతున్నారు.

ఇంటి వద్ద పెరటి తోటలతో కుటుంబానికి సరిపడా కూరగాయలు, ఆకుకూరలను పండించుకుంటూ పచ్చదనంతో సేదతీరేవారు. చుట్టుపక్కల పూల కుండీల్లో అందమైన మొక్కలు, ఆకట్టుకునే రీతిలో పచ్చదనాన్ని కాపాడుకునే అవకాశం లేకుండా పోయింది. రైల్వే స్టేషన్‌లో చిన్న పిల్లలు, లగేజీ బ్యాగులపై దాడికి పాల్పడుతున్నాయి.

పోలీస్ స్టేషన్, వివిధ ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంతోపాటు కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, డిష్, ఇంటర్‌నెట్ కేబుల్స్ తదితర ప్రసార సాధనాల కేబుల్స్ పట్టుకొని కోతులు వేలాడుతుండడంతో ఎక్కడికక్కడ తెగి పడుతున్నాయి. ఫలితంగా రూ.లక్షల్లో నష్టం రావడమే కాకుండా పోలీసులకు తలనొప్పిగా మారింది.

వణుకుతున్న చిన్న పిల్లలు



అంగన్‌వాడీ కేంద్రాల వద్ద కోతుల గుంపు సేదతీరుతూ కిటికీల వద్ద వేలాడుతుండడంతో చిన్నారులు వణికిపోతున్నారు. ఒకవేళ డోర్ లాక్ చేయడం మరిచిపోతే చిన్నారుల బాక్సులు, బ్యాగులు లాక్కెళ్లి అలజడి సృష్టిస్తున్నాయి.

– గుర్రాల శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్

వేడుకల నిర్వహణ కష్టం



ప్రతిరోజు దేవాలయంలో చేసే పూజా కార్యక్రమాలతోపాటు వివిధ సందర్భాల్లో నిర్వహించే వేడుకల సమయంలో కోతులతో పడే బాధలు వర్ణనాతీతం. భక్తులు తీసుకొచ్చే కొబ్బరికాయ, ప్రసాదాల బ్యాగులను లాక్కెళ్లడం, ఆలయంలో ప్రదక్షిణలు చేయలేకపోవడం, పూజా సమయంలో ఒక వ్యక్తిని కాపలా పెట్టడం, పలుమార్లు బాణాసంచా కాల్చడం ఎన్ని చేసినా కోతుల నివారణ శూన్యం.

– కమ్మల చంద్రశేఖరశర్మ, ఆలయ పూజారి

వాకింగ్ చేసే పరిస్థితి లేదు



ఉదయమే రోడ్డుపై, ఉద్యాన వనంలో కోతుల మందలు సంచరిస్తుండడంతో వయోవృద్ధులు, వృద్ధులు, చిన్నారులు, మహిళలు వాకింగ్ చేయడమనేది సాహసంగా మారుతోంది. ఒకవేళ చేతిలో కర్ర పట్టుకొని నడిస్తే కోతుల మంద నేరుగా మనపైనే దాడులు చేస్తున్నాయి. ఇంట్లోనే వ్యాయామ సామగ్రి ఏర్పాటు చేసుకుంటున్నారు.

– మహ్మద్ ఉస్మాన్ షరీఫ్, సామాజిక కార్యకర్త

విధుల బహిష్కరణ

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు పర్మినెంట్ టౌన్‌షిప్‌లో విధులు నిర్వహించే కాంట్రాక్టు కార్మికులకు ఏరియర్స్ వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిలుక శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం కార్మికులు విధులు బహిష్కరించి టౌన్‌షిప్ దుకాణ సముదాయంలో నిరసన చేపట్టారు. 30 సంవత్సరాల నుంచి పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని అన్నారు. ఒప్పందంలో భాగంగా ప్రతి నెల కార్మికులకు చెల్లించాల్సిన రూ.1,020 అలవెన్సులు 16 నెలలుగా చెల్లించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సంబంధిత అధికారి ఏజీఎం ఉమేశ్‌కుమార్ హామీ మేరకు పనుల్లోకి వెళ్లామని అన్నారు. పి.స్వామి, సూపర్‌వైజర్లు, కార్మికులు పాల్గొన్నారు. ఎస్సై టి.ఉదయ్‌కిరణ్ తన సిబ్బందితో బందోబస్తు చేపట్టారు.


జ్యోతినగర్: కాంట్రాక్టు కార్మికుల నిరసన

గోదావరిఖని: రెండు నెలలుగా జీతాలు చెల్లించలేదని సోమవారం ఓసీపీ-3 బేస్ వర్క్‌షాప్‌లో సివిల్ కాంట్రాక్టు కార్మికులు విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు.

గ్రంథాలయాలు విజ్ఞానానికి భాండాగారాలు

జ్యోతినగర్: గ్రంథాలయాలు విజ్ఞానానికి భాండాగారాలని మాజీ కార్పొరేటర్ రమణారెడ్డి, ప్రజాస్వామిక ఉద్యమకారులు పోరెడ్డి వెంకటరెడ్డి, దుర్గం మల్లయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ దుర్గం సూరయ్య, తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లన్న, ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరు మధు, నేతకాని మహర్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం స్వామి అన్నారు. సోమవారం రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ అన్నపూర్ణకాలనీలోని సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు సమతా ఫౌండేషన్ నిర్వాహకులు దుర్గం ప్రమీల-నగేశ్ నిర్వహించిన బుద్ధ జయంతి, సమతా గ్రంథాలయ ప్రారంభోత్సవం వేడుకలకు హాజరయ్యారు. గౌతమ బుద్ధుడు, డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి బౌద్ధ ఉపాసకులతో కలిసి బుద్ధ వందనం చేశారు.


గ్రంథాలయం ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ రమణారెడ్డి

సమతా గ్రంథాలయానికి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి భారత రాజ్యాంగ పుస్తకాన్ని ఆవిష్కరించారు. సామాజిక సేవా కార్యకర్త దేవి లక్ష్మీనర్సయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బౌద్ధ మహాసభ నాయకుడు దుర్గం ప్రేమ్‌కుమార్, రత్నం బాబురావు, సమతా సైనిక దళ్ నాయకులు దూట రాజు, చీమల ఆనంద్, అశోక్, శాంతికుమార్, సానపురి శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెకు తరలిరండి

పెద్దపల్లిరూరల్: కార్మిక చట్టాలను కాపాడేందుకు ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు తరలి రావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యం రావు అన్నారు. హనుమంతునిపేట, రాంపల్లి, దామన్నపల్లి, మారేడుగొండ, గుర్రాంపల్లిలో హమాలీలతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. హమాలీ సంఘ నాయకులు సమ్మయ్య, గంగయ్య, నర్సయ్య, శంకర్, తిరుపతి, సత్యనారాయణరావు, రాజయ్య, మల్లయ్య, పురుషోత్తం తదితరులున్నారు.

కాల్వశ్రీరాంపూర్: కేంద్ర సర్కార్ కార్మిక హక్కులను కాలరాస్తూ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యం రావు ఆరోపించారు. సోమవారం పెగడపల్లి గ్రామంలో కేంద్ర సర్కార్ తీరును నిరసిస్తూ ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ వాల్ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. హమాలీ కార్మికులు రమేశ్, సమ్మయ్య, మొండయ్య, మధునయ్య, సదయ్య తదితరులు పాల్గొన్నారు.


పెద్దపల్లిరూరల్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముత్యంరావు, హమాలీలు

ధర్మారం: ఈనెల 20న నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం ధర్మారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శులు సీపెల్లి రవీందర్, జ్యోతి మాట్లాడారు. ఆకుల రాజయ్య, రాగుల మల్లేశం, శంకర్, బొల్లి నర్సయ్య, గాజుల స్వామి, వినోద్, గుమ్మడి శ్రీహరి, అనసూయ, చిలకమ్మ పాల్గొన్నారు.

యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా రీసెర్చర్‌గా ఎన్టీపీసీ యువకుడు

జ్యోతినగర్: ప్రపంచంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా-బర్కిలిలో స్టూడెంట్ రీసెర్చర్‌గా ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌కు చెందిన జింకల సాయిరాంకు అరుదైన అవకాశం లభించింది. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఐదు సంవత్సరాల ఇంజినీరింగ్ విభాగంలో ఇంటిగ్రేటెడ్ బీ-టెక్(మెకానికల్ ఇంజినీరింగ్) విద్యనభ్యసిస్తున్నాడు. ఈ క్రమంలో పలు అవకాశాల కోసం తనవంతుగా ప్రయత్నిస్తున్న సందర్భంలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో విజిటింగ్ స్టూడెంట్ రీసెర్చర్‌గా ఆహ్వానం అందుకున్నాడు. బర్కిలిలో విజిటింగ్ స్కాలర్‌గా, విజిటింగ్ స్టూడెంట్ పరిశోధకుడిగా అవకాశం వచ్చింది. పలు రంగాల్లో వినూత్న ఆలోచనలతోపాటు సృజనాత్మకత, సహకారాన్ని పెంపొందించే ప్రఖ్యాత పరిశోధనా సంస్థలో అవకాశం లభించింది.

ఆనందంగా ఉంది



చిన్ననాటి నుంచి కష్టపడి చదివా. చొప్పదండి నవోదయ, చుక్కా రామయ్య కళాశాలలో చదివి మెరిట్‌తో ఐఐటీ ఖరగ్‌పూర్‌లో సీటు సాధించా. బీటెక్ నాలుగో సంవత్సరం పూర్తి కావస్తున్న సమయంలో యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా-బర్కిలిలో రీసెర్చర్‌గా అవకాశం రావడం ఆనందంగా ఉంది. నా ఆశయానికి పెద్దనాన్న దహెగాం ఉమామహేశ్వర్, అన్నయ్య దహెగాం ఆదిత్య ఆర్థిక సహకారంతో ఇంత మంచి అవకాశం వచ్చింది. ఏఐ రోబోటిక్స్‌పై పరిశోధనలు చేస్తా.

– జింకల సాయిరాం, ఎన్టీపీసీ రామగుండం, కృష్ణానగర్

బీజేపీ కాలనీ పట్టణ అధ్యక్షుడిగా శశికుమార్

యైటింక్లయిన్‌కాలనీ: భారతీయ జనతా పార్టీ రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ పట్టణ అధ్యక్షుడిగా కాలనీకి చెందిన ఆకుల శశికుమార్‌ను నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవ్‌రెడ్డి తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు.

మండల అధ్యక్షుడిగా సతీశ్‌కుమార్

జ్యోతినగర్: బీజేపీ ఎన్టీపీసీ-రామగుండం మండల అధ్యక్షుడిగా మిట్టపల్లి సతీశ్‌కుమార్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి నియామక ఉత్తర్వులను అందించారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తున్న సతీశ్‌కుమార్‌ను రెండోసారి అధ్యక్షుడిగా నియమించారు.

సుఖ ప్రసవంతోనే ఆరోగ్యం

రామగుండం: గర్భిణుల సుఖ ప్రసవానికి సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సురక్షితమైన వైద్య సేవలందుతాయని, ఫలితంగా గర్భిణులు సుఖ ప్రసవమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అంతర్గాం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉదయ్‌కిరణ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన గర్భిణులకు పలు ఆరోగ్య సలహాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ సురేశ్‌బాబు, పుష్పలత, సమ్మయ్య, తిరుపతి, ఏఎన్‌ఎంలు అన్నపూర్ణ, నజ్మా, సరోజ, లలిత, ఆశ వర్కర్లు తదితరులున్నారు.

నేత్రదానంపై అపోహలు వీడండి

పాలకుర్తి: మరణించిన వారి నేత్రాలను దానం చేయడానికి ప్రజలు అపోహలు వీడి ముందుకు రావాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి మెరుగు భీష్మాచారి పిలుపునిచ్చారు. జీడినగర్‌కు చెందిన జంపాల యాదగిరి ఇటీవల మృతిచెందగా.. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేసి ఇద్దరికి చూపును ప్రసాదించారు. సోమవారం వారి నివాసంలో యాదగిరి సంస్మరణ సభను సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అభినందన పత్రాన్ని మాజీ సర్పంచ్ సూర సమ్మయ్య చేతుల మీదుగా అందజేశారు.

మాజీ జెడ్పీటీసీ జన్మదిన వేడుకలు



ఓదెల: మండలంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ జెడ్పీటీసీ గంట రాములుయాదవ్ జన్మదిన వేడుకలు జరిగాయి. అభిమానులు కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. హరిపురం గ్రామంలో ఉపాధి కూలీలకు కూల్‌డ్రింక్స్ పంపిణీ చేశారు. ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో అభిమానులు పూజలు చేశారు.

జోరుగా ఆక్రమణలు



సుల్తానాబాద్: పట్టణంలోని మార్కండేయకాలనీ ప్రారంభంలోనే ఆక్రమించుకొని చుట్టుపక్కల గోడతో నిర్మాణం చేపట్టారు. పట్టణానికి మార్కెట్, ఇతర సౌకర్యాలకు ఆ రహదారి వెంబడే ప్రజలు వస్తూ పోతుంటారు. స్థానికులు మాత్రం స్థానిక ప్రజాప్రతినిధుల ప్రోత్సాహంతోనే ఆక్రమణలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు.

యూనిక్ ఐడీ కార్డు తీసుకోవాలి

జూలపల్లి: భూమి ఉన్న ప్రతీ రైతు పదకొండు నంబర్లు గల యూనిక్ ఐడీ కార్డును తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రత్యూష సూచించారు. అబ్బాపూర్, పెద్దాపూర్ రైతులకు యూనిక్ ఐడీ కార్డు నమోదును చేపట్టారు.



కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిపై తాగునీటి పైపులైన్ పగిలి నీరంతా వృథాగా పోతోంది. రోడ్డు గుంతలు పడి వాహనాలు వెళ్లినప్పుడు బురద నీరు పాదాచారులు, వాహనదారులపై పడుతోంది. లీకైన నీరు తిరిగి అదే పైపుల్లోకి వెళ్లి తాగునీరు కలుషితమై వ్యాధులు వ్యాపిస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

సమ్మెతోనే సంస్థకు మనుగడ

గోదావరిఖని: సమ్మెతోనే సింగరేణి సంస్థకు మనుగడ సాధ్యమని జాతీయ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కొరివి రాజ్‌కుమార్, గడ్డం కృష్ణ, నాగరాజు గోపాల్, మిర్యాల రాజిరెడ్డి, విశ్వనాథ్ అన్నారు. సోమవారం జీడీకే-5 ఓసీపీలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోషం, మాదన మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం సింగరేణిలో సమ్మె జయప్రదం చేయాలని విప్లవ కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు కోరారు. జీడీకే-2వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. నాయకులు జక్కుల నారాయణ, ఐ.కృష్ణ, ఎస్.రవీందర్, ఫయాజ్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రమశక్తి అవార్డు గ్రహీతకు సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ: మే డే దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్జీ-2 ఏరియా ఓసీపీ-3 బేస్ వర్క్‌షాప్‌లో ఫోర్‌మేన్‌గా విధులు నిర్వహిస్తున్న సింగరేణి కార్మికుడు, ఐఎన్‌టీయూసీ రామగుండం రిజీయన్ జనరల్ సెక్రటరీ ఎండీ అక్రమ్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా శ్రమశక్తి అవార్డును అందుకున్నారు. సోమవారం ఆర్జీ-2 ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో యైటింక్లయిన్‌కాలనీ ఐఎన్‌టీయూసీ యూనియన్ కార్యాలయంలో సన్మానించారు.

పనులు త్వరగా పూర్తి చేయండి

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సెక్టార్-3 సింగరేణి పాఠశాలలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి సీబీఎస్ఈ సెలబస్‌లో విద్యాబోధనకు అనుమతులు రావడంతో సోమవారం ఆర్జీ-2 జీఎం వెంకటయ్య, ఏఐటీయూసీ గుర్తింపు సంఘం జనరల్ సెక్రటరీ రాజ్‌కుమార్, ఇతర సింగరేణి అధికారులు, నాయకులు పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ తరగతి గదులను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. మిగిలి ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి తొలి దశ అడ్మిషన్లు, స్కూల్ బస్సుల కోసం టెండర్ ప్రక్రియను తక్షణమే చేపట్టాలని సూచించారు. ఆర్జీ-2 ఎస్ఓటు జీఎం రాముడు, ఏజీఎం వర్క్‌షాప్ ఎర్రన్న, ఏఐటీయూసీ యూనియన్ నాయకులు వైవీరావు, ఎల్లాగౌడ్, సమ్మయ్య పాల్గొన్నారు.

నర్సుల సేవలు అభినందనీయం

రామగిరి: వైద్య వృత్తిలో నర్సులు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావు అన్నారు. నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సెంటినరీకాలనీ సింగరేణి డిస్పెన్సరీలో నిర్వహించిన వేడుకలను జీఎం హాజరై నర్సులను సన్మానించారు. డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, సుదర్శనం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్సైగా పదోన్నతి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీకి చెందిన ఇంటలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్ కొంతం కృష్ణారెడ్డి ఏఎస్సైగా పదోన్నతి పొందారు. సోమవారం కృష్ణారెడ్డికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పదోన్నతి స్టార్‌ను అందించారు.

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ ఏఎస్సైగా పదోన్నతి పొందారు. శ్రీనివాస్‌ను సీపీ అంబర్ కిషోర్ అభినందించారు.

విద్యుత్ ప్రజావాణితో సమస్యలు పరిష్కారం

పెద్దపల్లిరూరల్: విద్యుదాఘాతంతో తన కుమారుడు మరణించాడని, ఇప్పటివరకు సంస్థ నుంచి పరిహారమందలేదంటూ రాఘవాపూర్ గ్రామానికి చెందిన శారద విద్యుత్ ప్రజావాణిలో ఎస్ఈ మాధవరావుకు వినతిపత్రం అందించింది. విద్యుత్ శాఖకు సంబంధించిన సమస్యలపై వినతులు స్వీకరించి వాటికి సత్వర పరిష్కారం చూపేందుకు ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్ఈ కంకటి మాధవరావు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో అర్జీలను స్వీకరించారు.

పంట మార్పిడితో సుస్థిర ఆదాయం

ముత్తారం: పంట మార్పిడితో రైతులకు సుస్థిర ఆదాయం సమకూరుతుందని కూనారం వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు కార్యక్రమంలో మాట్లాడారు. ఆరుతడి, వాణిజ్య పంటల సాగుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. రసాయన మందులను మోతాదులోనే వాడాలని సూచించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి జీవామృతం, ప్రకృతి ఎరువుల వల్ల కలిగే లాభాల గురించి వెల్లడించారు. కాగా, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటా ఆలస్యం అవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేయగా, జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి జోక్యం చేసుకొని కొనుగోళ్లు వేగవంతం అయ్యేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వ్యవసాయ పరిశోధన స్థానం కూనారం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్ సిద్ధి, కరీంనగర్ డాట్ సెంటర్ రాజేంద్రప్రసాద్, తెలంగాణ సీడ్ ఆర్ఎం విష్ణువర్ధన్, పీఏ సీఎస్ చైర్మన్ అల్లాడి యాదగిరిరావు, ఎంపీడీవో సురేశ్, హార్టికల్చర్ అధికారి జ్యోతి, మండల వ్యవసాయ అధికారి అనూష, ఏఈవోలు మనీషా, హారిక, శ్రీలేఖ, ఏపీఎం పద్మ పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహుడికి చందనోత్సవం

పెద్దపల్లిరూరల్: దేవునిపల్లిలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సోమవారం చందనోత్సవం, పంచామృతాభిషేకాలను అర్చకుడు శ్రీకాంతచార్యులు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అన్నదానం నిర్వహించారు.

రథోత్సవం

ధర్మారం: పత్తిపాక గ్రామంలోని శ్రీలక్ష్మీనృసింహ స్వామి రథోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

రామగిరి: కల్వచర్ల గ్రామంలో శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, కొట్టే సందీప్, కొలిపాక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా..

జూలపల్లి: కుమ్మరికుంటలో శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. సోమవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి స్వామి సమేత పద్మావతి, మంగ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు రథాన్ని లాగడంతోపాటు స్వామివారికి మొక్కులు చెల్లించారు. అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా దీపోత్సవం

ఎలిగేడు: ముప్పిరితోటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. రామిడి వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం

కాల్వశ్రీరాంపూర్: పందిల్ల శివాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు శివపార్వతుల కల్యాణం, వార్షిక వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు దూపం సాంబమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

గౌతమ బుద్ధ జయంతి

ధర్మారం: మండల కేంద్రంలో గౌతమ బుద్ధ జయంతి సోమవారం నిర్వహించారు. బుద్ధ ఉపాసకులు బొల్లి స్వామి ఆధ్వర్యంలో స్థానిక గౌతమ బుద్ధ ఫంక్షన్ హాల్ వద్ద బుద్ధ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాంపెల్లి రాజేశం, నాయకులు గోనే సత్యనారాయణ, దాగేటి కొమురయ్య, బొడ్డు భూమయ్య, సుందరగిరి పోశెట్టి, మల్లమ్మ, పాలకుర్తి బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.